సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



సీజనల్ వ్యాధులపై సర్వే

సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్నారు.

- 9లో ▸



పౌష్టికాహారం అందించాలి

జిల్లాలో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.2 /22.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన డీఆర్‌డీవో



కామారెడ్డి క్రైం : కామారెడ్డి డీఆర్‌డీవోగా నియమితులైన సురేందర్ శనివారం కలెక్టరేట్‌కు విచ్చేసి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కమర్షియల్ వాహనాల పెండింగ్ టాక్స్‌లు చెల్లించాలి



కామారెడ్డి క్రైం : జిల్లాలో ఉన్న కమర్షియల్ వాహనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న టాక్స్‌లను యజమానులు వెంటనే చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన కామారెడ్డిలో 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా టాక్స్‌లు పెండింగ్‌లో ఉన్న కమర్షియల్ (గూడ్స్) వాహనాలు 7,500 ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు వారు రవాణా శాఖ అధికారులను సంప్రదించి టాక్స్‌లను క్లియర్ చేసుకోవాలన్నారు. లేదంటే తనిఖీల్లో రెండింతలు జరిమానా వేస్తామని హెచ్చరించారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏదైనా కారణాలతో వాహనాలు మూలనపడిన, నడపకుండా పక్కన పెట్టినా తమను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాంటి వాహనాలకు మినహాయింపు లభిస్తుందని తెలిపారు. మళ్లీ బయటకు తీసి నడపాలంటే రవాణా శాఖలో నమోదు చేసుకున్న వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ మాత్రమే..

కామారెడ్డి క్రైం : జిల్లావ్యాప్తంగా ఈ నెల 5న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ మాత్రమే ఉంటుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కార మార్గాలు చూపడం లాంటివి తర్వాత ఉంటాయన్నారు. ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

చినజీయర్ స్వామిని కలిసిన షబ్బీర్ అలీ



కామారెడ్డి క్రైం : హైదరాబాద్‌లోని ప్రముఖ పారిశ్రామికవేత్త రహీం సూఫీ నివాసానికి వచ్చిన త్రిదండి చినజీయర్ స్వామిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి ఆశీర్వాదం తీసుకుని కొద్దిసేపు ముచ్చటించారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ కేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు శనివారం ప్రిన్సిపల్ ఇందూరు గంగాధర్, సమన్వయకర్త జలీల్ అహ్మద్ తెలిపారు. 2024–25కు సంబంధించి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉందన్నారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ పాసైన వారు నేరుగా అడ్మిషన్ తీసుకోవచ్చన్నారు. ఆసక్తి కల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

13 నుంచి బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

స్నేహితం.. సేవే అభిమతం



- ఆపదలో అండగా నిలుస్తున్న మిత్రులు
- తోటివారికి మేమున్నామనే భరోసా
- సామాజిక సేవలోనూ తరిస్తున్న వైనం
- నేడు స్నేహితుల దినోత్సవం

కలిసి చదువుకున్నారు.. కష్ట సుఖాల్లో పాలు పంచుకున్నారు.. ఆపదలో ఉన్న తోటి మిత్రులకు స్నేహ హస్తం అందించి అండగా నిలుస్తున్నారు. కష్ట సమయంలో మేమున్నామనే భరోసా ఇస్తున్నారు. అందరు కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎవరికీ చెప్పలేని విషయం స్నేహితుడితో మాత్రమే చెప్పుకుంటాం. వైఫల్యాలకు కుంగిపోతున్నపుడు సాధకుడివని, సాగిపొమ్మంటూ మార్గనిర్దేశం చేసేవాడు మిత్రుడు. తరాలు మారుతున్నా స్నేహానికి అర్థం మారడం లేదు. ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు నేటి తరం స్నేహితులు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వాటి వేదికలుగా స్నేహితులు గ్రూపులను ఏర్పాటు చేసుకుని సామాజిక సేవ కోసం తలా ఒక చేయి వేస్తున్నారు. స్నేహితుడు ఏదైనా ఆపదలో ఉన్నాడని తెలిస్తే చాలు అందరూ కలుసుకుని తమతో అయ్యే సాయం అందిస్తున్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తి ఆస్పత్రిపాలైనా, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినా కుటుంబాలకు అండగా నిలవడానికి ప్రయత్నిస్తున్నారు. అప్పటికప్పుడు తమతో అయిన మేర డబ్బులు జమ చేసుకుని ఆ కుటుంబానికి అందించి మేమున్నామనే భరోసా ఇస్తున్నారు. రక్తసంబంధికులు దూరంగా ఉన్నా, బంధువులు దరిచేరకున్నా మిత్రులు మాత్రం ఆ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అలాగే ఏదైనా సామాజిక సేవ చేయాలని వాట్సాప్ గ్రూపుల్లో ఏ ఒక్క సభ్యుడు ప్రతిపాదించినా వెంటనే ఆచరణలో పెడుతున్నారు. తద్వారా అనేక మంది సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



మిత్రులకు చేయూత



పెద్దకొడప్‌గల్ : పెద్దకొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో 2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆపదలో ఉన్న తమ తోటివారికి సాయం చేస్తున్నారు. మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన మిత్రుడు సురేందర్ కుటుంబానికి రూ.25 వేల నగదు అందజేశారు. తమ మిత్రుడు గైని నాగయ్య కుమారుడి కిడ్నీలు చెడిపోగా వీరంతా కలిసి ఆర్థిక సాయం అందించారు.

వైడీఎఫ్ బృందం పేరిట..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి డెవలప్‌మెంట్ ఫోరమ్(వైడీఎఫ్) మిత్రబృందం సభ్యులు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎల్లారెడ్డిలో 1987–89 ఇంటర్‌కు చెందిన బ్యాచ్ విద్యార్థులు వైడీఎఫ్ బృందంగా ఏర్పడి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మిత్ర బృందంలో ఆరోగ్య సమస్యలతో బాధపడిన వారికి ఆర్థికసాయం అందిస్తున్నారు. మండలంలోని తిమ్మాపూర్, గండిమాసానిపేట గ్రామాల్లో హెల్త్ క్యాంపులను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.



వైడీఎఫ్ మిత్రబృందం సభ్యులు

ప్రజలకు సేవ చేయాలని..

బీబీపేట : పుట్టిన గ్రామానికి తమవంతు సేవ చేయాలని బీబీపేట గ్రామానికి చెందిన మిత్రులు బొశెట్టి నాగేశ్వర్, సుతారి రమేష్, ఏలేశ్వరం చంద్రమౌళి సంకల్పించారు. వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సుమారు రూ.6.50 లక్షలతో గ్రామానికి వైకుంఠ రథం అందజేశారు. దాని నిర్వహణను కూడా వారే చూసుకుంటున్నారు. ఆ వైకుంఠరథం మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు సైతం ఉపయోగపడుతోంది.



బీబీపేట గ్రామానికి వైకుంఠరథాన్ని అందజేస్తున్న మిత్రులు

16 ఏళ్లుగా సమాజ సేవలో...

లింగంపేట : 'యువతా మేలుకో– సమాజ సేవకు పూనుకో' అనే నినాదంతో లింగంపేటకు చెందిన 11 మంది క్లాస్‌మెంట్స్ 2008లో యువ యూత్‌ను స్థాపించారు. 16 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఏటా వినాయక చవితికి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు.



లింగంపేటలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తూ..

మేమున్నామని..



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బాల్యమిత్ర బృందంగా ఏర్పడి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తోటి మిత్రులకు అండగా నిలుస్తున్నారు. తమ స్నేహితుడికి మైక్ సెట్ అందించి ఉపాధి కల్పించారు. మరో మిత్రుడి కిడ్నీ ఫెయిల్ కాగా ఆయన కుటుంబానికి ఆర్థికసాయం చేశారు.



విద్యార్థులకు ప్రోత్సాహం

తాడ్వాయి: తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామానికి చెందిన కృష్ణాకర్‌రావు, చాకలి కిషన్, సుభాష్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్, మైపాల్, శివాజీరావు, కాషాగౌడ్, బాలురాజు 20 ఏళ్లుగా స్నేహితులు. వీరు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రతి సంవత్సరం గ్రామంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోత్సాహకాలు అందిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షా కిట్‌లను అందజేశారు. గ్రామంలో వివేకానందస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం జయంతి నిర్వహిస్తున్నారు.



ఎర్రాపహాడ్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న యువకులు



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించండి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కామారెడ్డి క్రైం : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయబద్ధంగా ఉన్న వాటికి రెగ్యులైజేషన్ పట్టాలు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలెక్టర్‌లను ఆదేశించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న దాదాపు 20 లక్షలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రుటిని ప్రారంభించాలని సూచించారు. రెవెన్యూ మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. 3 నెలల వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వివరించాలని సూచించారు. వీసీలో కామారెడ్డి నుంచి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల నిర్వహణపై సూచనలు

కామారెడ్డి క్రైం : ఈవీఎంల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి ముఖ్య ఎన్నికల అధికారి జూమ్ మీటింగ్ ద్వారా శనివారం పలు సూచనలు చేశారు. కోర్టుల్లో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాల ఈవీఎం మిషన్లను తదుపరి కోర్టు ఆదేశాలు వచ్చే వరకు అలాగే భద్రంగా ఉంచాలన్నారు. ఎలాంటి కేసులు లేని నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జూమ్ మీటింగ్‌లో కామారెడ్డి నుంచి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు.

జిల్లాలో మరో తొమ్మిది పంచాయతీలు

- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో కొత్తగా మరో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఏర్పాటవుతున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు 526 గ్రామ పంచాయతీలు ఉండగా, కొత్తగా తొమ్మిది ఏర్పాటు అవుతున్నాయి. నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూరు పంచాయతీలో కొనసాగుతున్న చిన్న ఆత్మకూరు గ్రామాన్ని, ధర్మారెడ్డి పంచాయతీ పరిధిలో ఉన్న కన్నారెడ్డి గ్రామాన్ని పంచాయతీలుగా ఏర్పాటు చేస్తున్నారు. గాంధారి మండలం తిమ్మాపూర్ పంచాయతీలోని పిస్కిల్ గుట్ట తండాను, నస్రుల్లాబాద్ మండలం లింగంపల్లి తండా పంచాయతీలోని ఫకీర్‌నాయక్ తండాను, మాచారెడ్డి మండలం సోమార్‌పేట్ పంచాయతీ పరిధిలోని సోమార్‌పేట్ తండాను, అంకిరెడ్డిపల్లి తండా జీపీ పరిధి గుంటితండాను కొత్త జీపీలుగా ఏర్పాటు చేస్తున్నారు. మైసమ్మ చెరువు తండా పంచాయతీలోని ఒడ్డెరగూడెంను, బీర్కూర్ మండలం భైరాపూర్ జీపీ పరిధిలోని సంబాపూర్‌ను, నస్రుల్లాబాద్ మండలం సంగెం పంచాయతీ పరిధిలోని సంగెం(ఎ)ను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

ఔత్సాహిక ఆవిష్కర్తలకు సహకారం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ఔత్సాహిక ఆవిష్కర్తలకు పూర్తి సహకారం అందించడానికి రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ సిద్ధంగా ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. 'ఇంటింటా ఇన్నోవేటర్ – 2024' ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన 'వాక్ ఫర్ ఇన్నోవేషన్' ర్యాలీని నిజాంసాగర్ చౌరస్తా వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ చౌరస్తా నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఆవిష్కర్త ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉత్తమమైన ఆవిష్కరణలకు ఆగస్టు 15న అవార్డు ఇస్తామని తెలిపారు. ఆగస్టు 10లోగా ఆవిష్కర్తలు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఈవో రాజు, తహసీల్దార్ జనార్దన్, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీడబ్ల్యూవో బావయ్య, ఈడీఎం ప్రవీణ్ కుమార్, టీఎస్ఐసీ జిల్లా కో ఆర్డినేటర్ గగన్ పాల్గొన్నారు.



జెండా ఊపి ఇంటింటా ఇన్నోవేటర్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కామారెడ్డి క్రైం : కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా సమాఖ్య సమావేశానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరయ్యారు. మహిళా శక్తి కార్యక్రమాలు, స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. డీఆర్‌డీవో సురేందర్, డీపీవో శ్రీనివాస్, స్త్రీ నిధి జోనల్ మేనేజర్ కిశోర్, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, డీపీఎంలు రవీందర్ రావు, సుధాకర్, రమేష్ బాబు, వకుల, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజమణి తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి

- మత్తు పదార్థాలను అరికట్టాలి
- ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం : న్యాయస్థానాల్లో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ సింధుశర్మ అధికారులకు సూచించారు. పోలీసు శాఖ నెల వారీ సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలు, పురోగతి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణచి వేయాలన్నారు. వాటి సరఫరా, వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పేకాటపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, డ్రంకన్ డ్రైవ్‌లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల బాధితులకు బాసటగా నిలవాలని సూచించారు. కేసుల విచారణ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధుశర్మ

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం



బోర్లంలో పొలంబాటలో పాల్గొన్న అధికారులు

బాన్సువాడ రూరల్ : రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈ ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన ఏడీఈ శిరీష్, ఏఈ అనిల్‌కుమార్‌లతో కలిసి బోర్లం గ్రామంలో పొలంబాట కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. విద్యుత్ స్తంభాల నుంచి వేలాడుతున్న తీగలను సరిచేస్తున్నామన్నారు. అలాగే వంగిన, విరిగిన, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చుతున్నామన్నారు. రైతులు ఏదైనా సమస్య ఉంటే సొంతంగా మరమ్మతులు చేసుకోకుండా లైన్‌మన్‌కు గాని, ఏఈకి గాని తెలియజేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఇటిరెడ్డి విఠల్‌రెడ్డి, మంద బాగయ్య, మంగళి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాబ్ మేళాకు స్పందన కరువు



బాన్సువాడ : బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన కరువైంది. జాబ్‌మేళాకు సంబంధించిన నిబంధనలను విద్యార్థులకు చేరవేడంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంతో అర్హులైన వందలాది మంది విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరు కాలేకపోయారు. 2023–2024లో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులే జాబ్‌మేళాకు హాజరుకావాలని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రతినిధులు తెలిపారు. కానీ ఈ వివరాలను విద్యార్థులకు చేరవేడంలో కళాశాల అధ్యాపకులు విఫలమయ్యారు. డిగ్రీ, పీజీలు పూర్తిచేసిన విద్యార్థులు కూడా జాబ్ మేళాకు హాజరుకావడంతో హెచ్‌సీఎల్ ప్రతినిధులు వారందరిని పంపించారు. 2023–2024లో ఇంటర్ పూర్తిచేసిన కేవలం ఆరుగురు విద్యార్థులే ఉండడంతో వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో ఇద్దరు విద్యార్థులే జాబ్‌కు అర్హత సాధించారు.

కలెక్టర్‌ను కలిసిన స్త్రీ నిధి జోనల్ మేనేజర్



కామారెడ్డి క్రైం : స్త్రీనిధి జోనల్ మేనేజర్‌గా నియమితులైన అనంత కిషోర్ శనివారం కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్‌ను కలిసినట్లు తెలిపారు. ఇదివరకు ఆయన నిజామాబాద్ జోన్‌కు పనిచేశారు. ఇదివరకు కామారెడ్డితో పాటు మరో నాలుగు జిల్లాలకు జోనల్ మేనేజర్‌గా పని చేసిన టీవీ రవికుమార్ నిజామాబాద్ జోన్‌కు బదిలీ అయ్యారు.

'చిన్న వ్యాపారుల కోసం విధానం రూపొందించాలి'

కామారెడ్డి అర్బన్ : కార్పొరేట్ వ్యాపార సంస్థలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు చేస్తున్న వారికి సాంప్రదాయంగా చిన్నచిన్న వ్యాపారాలు చేసేవారి మనుగడ అగమ్యగోచరంగా తయారైనందున ప్రభుత్వం వెంటనే ఒక విధానం రూపొందించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్గనైజింగ్ వైస్ ప్రెసిడెంట్ పార్శి కాంశెట్టి అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన చేశారు. చిన్నచిన్న పట్టణాల్లో బడా కార్పొరేట్ సంస్థలకు అనుమతులు ఇవ్వరాదన్నారు. ఒకసారి చిన్నవ్యాపారులు వీధిన పడితే పరిస్థితి సమాజంలో పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతుందని పార్శి కాంశెట్టి పేర్కొన్నారు. చిన్న వ్యాపారుల కోసం ప్రభుత్వం విధానం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

పరిహారం నిర్ణయమే ప్రధాన సమస్య?

- జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులు
- మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్



నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించనున్న జాతీయ రహదారి



బైపాస్ రోడ్డు కోసం సేకరించనున్న వ్యవసాయ భూమి

మోర్తాడ్: జాతీయ రహదారి63 విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మించేందుకు సేకరించే భూమికి పరిహారం ఎంత చెల్లించాలనే అంశంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ప్రభుత్వం చెల్లించే పరిహారానికి రైతులు చెప్పే ధరకు ఎంతో వ్యత్యాసం ఉండటంతో ఎంత చెల్లించాలని నిర్ధారించడమే ప్రధాన సమస్యగా మారింది. చాలా చోట్ల వ్యవసాయ భూములే నష్టపోతుండగా వెంచర్లకు అనుకూలమైన భూములు ఇందులో ఉండటం గమనార్హం. ఈ భూములను జాతీయ రహదారి విస్తరణకు అప్పగిస్తే రూ.కోట్లలో నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోర్తాడ్, గాండ్లపేట్ రైతులకు చెందిన 30.154 హెక్టార్ల భూమిని బైపాస్‌రోడ్డు కోసం అప్పగించాల్సి వస్తుంది. జాతీయ రహదారి విస్తరణ చేయకుంటే ఇప్పుడు నష్టపోయే భూమిలో ఎక్కువ శాతం వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీలు ఉంది. ఇప్పటికే బైపాస్ రోడ్డు కోసం గుర్తించిన భూమి పరిసరాల్లో ఎన్నో వెంచర్లు వెలిశాయి. ఇళ్ల స్థలాల కోసం విక్రయించిన వ్యవసాయ భూమికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎకరానికి రూ.1.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల ధర చెల్లించారు. ఈలెక్కన ఇప్పుడు నష్టపోయే భూములకు రైతులు ఒక్కో ఎకరానికి రూ.1 కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. భూసేకరణకు సంబంధించి రైతులతో ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్ ఇటీవల సమావేశం నిర్వహించగా అందులో పాల్గొన్న రైతులు పరిహారం విషయంలో మార్కెట్ ధరలను పరిగణలోకి తీసుకోవాలని విన్నవించారు. మోర్తాడ్‌లోని ఒకే సంఘం రైతుల భూములు ఇప్పటికే వరద కాలువ, రైల్వే లైన్ నిర్మాణానికి ప్రభుత్వానికి దారదత్తం అయ్యాయి. ఇప్పుడు తాజాగా జాతీయ రహదారి బైపాస్‌కు అప్పగించాల్సి రావడంతో అనేక మంది రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం నామమాత్రంగా ఉంటే తాము మరో చోట వ్యవసాయ భూమిని కొనలేమని రైతులు పేర్కొంటున్నారు.

ఎక్కువ నిధులు అవసరం

పెర్కిట్ నుంచి జాతీయ రహదారి విస్తరణ కోసం 83.895 హెక్టార్ల భూమిని సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. పరిహారం రైతులు కోరిన విధంగా చెల్లించాలంటే రూ.200 కోట్లకు మించి ఎక్కువ నిధులు భూసేకరణ కోసం కేటాయించాల్సి వస్తుంది. పడిగెల, అంక్సాపూర్, కుకునూర్, దొన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లిలోని రైతులే ఎక్కువగా భూమిని నష్టపోతున్నారు. వాణిజ్య పరంగా ఉపయోగించే భూమికి కొంత ఎక్కువ ధర చెల్లించి, వ్యవసాయానికి యోగ్యమైన భూమికి మరో రకమైన ధర చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

మంచి ధర వచ్చేలా చూస్తాం

జాతీయ రహదారి విస్తరణలో భూమి నష్టపోతున్న వారికి మంచి ధర వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. రైతులతో సంప్రదింపులు పూర్తయిన తర్వాత వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటాం. ఉన్నతాధికారులకు నివేదిక అందించి నష్టపోతున్న రైతులకు ఎక్కువ పరిహారం అందేలా చూస్తాం.

– రాజుగౌడ్, ఆర్డీవో, ఆర్మూర్

'ధరణి' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం : 'ధరణి' పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తూ సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లకు సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్‌లతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి సమస్యలను పరిష్కరించడానికి అనుగుణంగా రూపొందించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లు–2024 పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడానికి సీసీఎల్ఏ వెబ్‌సైట్ ద్వారా అవకాశం కల్పించామన్నారు. ఈనెల 2 నుంచి 23వ తేదీ వరకు నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియపర్చవచ్చన్నారు. సలహాలు, సూచనలను ఈ మెయిల్ ద్వారా తెలుపవచ్చన్నారు. పోస్ట్ ద్వారా కూడా 'ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్ రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, అబిడ్స్, హైదరాబాద్ 500001' చిరునామాకు పంపవచ్చన్నారు. వీసీ అనంతరం కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా లోని అన్ని మండలాల తహసీల్దార్లతో మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు. సీసీఎల్ఏ కమిషనర్ సూచనల మేరకు 10 రోజుల్లోగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రంగనాథ చారి, రాథోడ్ రమేష్, ప్రభాకర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్ విద్యార్థుల రాస్తారోకో



సౌత్‌క్యాంపస్ విద్యార్థి ప్రీతం కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ధర్నా చేస్తున్న విద్యార్థులు

- ప్రీతం కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

భిక్కనూరు : జిల్లా కేంద్రంలో శుక్రవారం మృతి చెందిన సౌత్‌క్యాంపస్ విద్యార్థి ప్రీతం కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం విద్యార్థులు బీటీఎస్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రీతంను ఢీకొని ఆయన మృతికి కారకుడయ్యాడని ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించి మృతుని కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాస్తారోకో విషయం తెలుసుకున్న ఏఎస్సై మల్లారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బీటీఎస్ వద్దకు వచ్చి విద్యార్థులను సముదాయించినప్పటికి విద్యార్థులు శాంతించకపోవడంతో పోలీసులు సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌కు సమస్య గురించి వివరించారు. దీంతో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ రాస్తారోకో వద్దకు అధ్యాపకులతో కల్సి వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాస్తారోకోతో ఇతరులకు ఇబ్బంది ఏర్పడుతుందని సముదాయించడంతో విద్యార్థులు శాంతించి రాస్తారోకో విరమించారు. ప్రీతం కుటుంబాన్ని ఆదుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట



దోమకొండలో పొలంబాటలో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు, రైతులు

దోమకొండ : మండల కేంద్రంలో నివారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ఏడీఈ కిరణ్ చైతన్య, ఈ ప్రదీప్‌కుమార్, సిబ్బంది పొలంబాట పట్టారు, రైతులకు విద్యుత్ ప్రమాదాలపైన అవగాహన కల్పించారు, ప్రతిరైతు కెపాసిటర్ బిగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యుత్ తీగలను సిబ్బంది తప్ప మిగితా వారు ముట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ నవీన్, ఫోర్‌మెన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద



బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు 26 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం 52 వేల క్యూసెక్కులు వచ్చిన వరద శనివారం ఉదయానికి 39 వేల క్యూసెక్కులకు తగ్గింది. క్రమంగా తగ్గుతూ మధ్యాహ్నానికి 19 వేల క్యూసెక్కులకు చేరింది. మళ్లీ పెరిగి 26 వేల క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి 17 వేల క్యూసెక్కులకు చేరింది. ఇలా రోజంతా తగ్గుతూ.. పెరుగుతూ వరద ప్రాజెక్ట్‌లోకి కొనసాగింది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం రాత్రికి ప్రాజెక్ట్‌లో 1079.30(43 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

అధ్వానంగా వజ్జపల్లి–ఉత్తునూర్ రోడ్డు



బురదమయంగా మారిన వజ్జపల్లి–ఉత్తునూర్ రోడ్డు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బీటీ రోడ్లు కూడా వర్షం దాటికి దెబ్బతింటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని మెటల్ రోడ్లు, గుంతలమయంగా మారి వాహనచోదకులకు ఇబ్బందులు వస్తున్నాయి. మండలంలోని వజ్జపల్లి నుంచి ఉత్తునూర్‌కు వెళ్లే మెటల్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండా పంట పొలాలకు వెళ్లే రైతులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని అప్పటి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు సర్వే కూడా పూర్తి చేశారు. బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు వేడుకున్నారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైబర్ నేరస్తుల కొత్త ఎత్తుగడ

- సెల్‌టవర్లకు స్థలం కావాలంటు ఫోన్లు

భిక్కనూరు: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడలతో జనాలను మోసం చేస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండటంతో కొత్త దారులను ఎంచుకుంటున్నారు. తాజాగా సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణానికి స్థలం లీజుకు తీసుకుంటామని నెలకు రూ. 25వేలను అద్దెగా చెల్లిస్తామంటూ జిల్లాలోని కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, లింగంపేట ఎల్లారెడ్డి మండలాల్లోని పలువురికి సైబర్‌నేరగాళ్లు శనివారం ఫోన్ చేశారు. తాము సెల్‌ఫోన్ కంపెనీలకు చెందిన వ్యక్తులమని మీ స్థలం మాకు నచ్చిందని స్థలానికి సంబంధించిన పత్రాలను వాట్సాప్‌కు పంపించాలని కోరారు. అనుమానం వచ్చిన కొందరు వారు చెప్పిన సెల్ ఫోన్ కంపెనీలకు ఫోన్ చేయగా అబద్ధమని తేలింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు.

నీకొడుకుపై కేసు నమోదైంది డబ్బులిస్తే వదిలేస్తాం



ఎల్లారెడ్డి: నీ కుమారుడు బ్రోతల్ కేసులో దొరికాడని రూ. 20 వేలు ఇస్తే కేసు నమోదు కాకుండా చూస్తామని వచ్చిన సైబర్ నేరస్తుడి ఫోన్ కాల్‌ను మండలంలోని మాచాపూర్‌కు చెందిన వెంకటేశం చాకచక్యంగా ఎదుర్కొన్నాడు. గ్రామానికి చెందిన బల్లి వెంకటేశంకు శనివారం సైబర్ నేరస్తుల నుంచి ఫోన్ వచ్చింది. నీ కుమారుడు సాయికుమార్ అమ్మాయలతో బ్రోతల్ కేసులో దొరికాడని అతడిని రిమాండ్ చేయకుండా ఉండాలంటే రూ. 70 వేలు డిమాండ్ చేశారు. తీరా రూ. 20 వేలకు బేరం కుదుర్చుకొని డబ్బు పంపాలన్నారు. దీంతో కంగారు పడ్డ వెంకటేశం మొదటగా డబ్బు పంపించే యత్నం చేశాడు. ఫోన్ పే నుంచి డబ్బులు పోలేదు. వారు చెప్పే మాటలపై వెంకటేశంకు అనుమానం వచ్చింది. తన కుమారుడి ఫోన్ పనిచేయకపోవడంతో అతని మిత్రులకు ఫోన్ చేసి కనుకున్నాడు. అతడు ఏ కేసులోతన కొడుకు ఎలాంటి కేసులో ఇరుక్కోలేదని తెలుసుకుని సైబర్ నేరస్తులకు వీడియో కాల్ చేసి తన కుమారుడిని చూయించాలని కోరాడు. దీంతో వారు ఫోన్ కట్ చేసి స్విచాఫ్ చేశారు. వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు తెలుపవద్దని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. భూతగాదాలతో ఒకరు, భార్య మృతికి మనస్తాపంతో మరొకరు, భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాల నేపథ్యంలో..



సత్యంరెడ్డి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

కామారెడ్డిక్రైం: భూతగాదాల నేపథ్యంలో ఒకరు ఆత్మహత్య చేసుకోగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఏదుల్ల రవీందర్ రెడ్డి(45) తనకు వారసత్వంగా వచ్చిన రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లత, ఓ కుమార్తె ఉన్నారు. సదరు భూమి రికార్డులు మాత్రం అతని పెదనాన్న సత్యం రెడ్డి పేరు మీద ఉన్నాయి. తన పేరు మీద పట్టా చేయించాలని చాలా సార్లు వారి మధ్య గొడవలు జరిగేవి. ఇటీవల పలుసార్లు గొడవలు జరిగి పోలీసు స్టేషన్ల వరకు వెళ్లాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు శుక్రవారం రాత్రి పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. సత్యంరెడ్డి ఇంటి ఎదుట బాధిత కుటుంబీకులు మృతదేహాన్ని ఉంచి కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. పోలీసులు కలుగజేసుకుని వారిని సముదాయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

భార్య మృతికి మనస్తాపంతో మరొకరు..

లింగంపేట: భార్య మృతికి మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శెట్పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల శంకరయ్య(56) భార్య ఎనిమిదేళ్ల క్రితం పాముకాటుతో మృతి చెందింది. దీంతో నాటి నుంచి తీవ్ర మనస్తాపంతో గురయ్యాడు. ఐదేళ్ల క్రితం కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగాడు. హైదరాబాద్‌లో ఉంటున్న శంకరయ్య కుమారుడు అరవింద్ అదే రోజు సాయంత్రం ఇంటికి రాగా అపస్మారకస్థితిలో ఉన్న తండ్రిని చూసి వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని..

రెంజల్: భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సాటాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన బొంబాయి శైలజ(30) మండలంలోని సాటాపూర్‌లో శుక్రవారం రాత్రి ఎలుకల మందు కొనుగోలు చేసి సేవించినట్లు పేర్కొన్నారు. అపస్మారక స్థితిలోకి చేరుకుని అక్కడే కిరాణషాపు మెట్లపై పడిపోయినట్లు వివరించారు. శనివారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భర్త సంజీవ్ మండలంలోని కందకుర్తికి చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నట్లు తెలుసుకున్న శైలజ రుద్రూర్ నుంచి కందకుర్తికి చేరుకుని భర్తను నిలదీయగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. భర్త బెదిరించడంతో మనస్తాపానికి గురైన ఆమె సాటాపూర్‌లో ఎలుకల మందు కొనుగోలు చేసి సేవించినట్లు వివరించారు. శైలజ అన్న గంగాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

బాన్సువాడ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడుతుండగా గమనించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ల చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం శివారులోని పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైర్లను చోరీ చేసినట్లు రైతు మంద నారాయణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 2న మధ్యాహ్నం 12గంటల తాను పొలం వద్ద ఉన్నానని, శనివారం ఉదయం పొలానికి నీరు పెడదామని బోరు వేయగా ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి ఉండటాన్ని గుర్తించారు. అందులో కాపర్ వైర్లను దుండగులు దొంగిలించినట్లు గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ పేర్కొన్నారు.

కుంటలో పడి ఒకరి మృతి

బోధన్‌రూరల్: ప్రమాదవశాత్తు కుంటలో పడి ఒకరు మృతి చెందిన ఘటన బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బి రాములు (43) శనివారం ఉదయం గ్రామ శివారులోని చెరువు కుంటలో బురదతో ఉన్న కాళ్లు చేతులను కడుక్కునేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో పడి మరొకరు..


బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని భజన్ చెరువులో పడి సాకలి సాయిలు(50) మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. శనివారం ఉదయం చెరువు కట్టపై ఉన్న గంగమ్మ గుడి సమీపంలో మృతుడి దుస్తులు, చెప్పులు ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జాలర్ల సహాయంతో సాయిలు మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ముస్కాన్'లో 74 మందికి రక్షణ

- సీపీ కల్మేశ్వర్
- ఐదు కేసులు నమోదు

ఖలీల్‌వాడి: జిల్లా వ్యాప్తంగా జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించామని, వెట్టిచాకిరి చేస్తున్న 74 మందికి విముక్తి కలిగించామని సీపీ కల్మేశ్వర్ శనివారం పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్, నిజామాబాద్, బోధన్ డివిజన్‌లలో 18 ఏళ్ల లోపు పనిచేస్తున్న 74 మంది చిన్నారులను ఈ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా పట్టుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ సబ్ డివిజన్‌లో 26, ఆర్మూర్ సబ్ డివిజన్‌లో 15, బోధన్ సబ్ డివిజన్‌లో 33 మొత్తం 74 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటి(సీడబ్ల్యూసీ) వారికి అప్పగించామని, తల్లిదండ్రులు ఉన్న పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి ఆదేశాల మేరకు వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం బాలకార్మికులతో పనిచేయిస్తున్న నగరంలోని నాలుగో టౌన్ పీఎస్, డిచ్‌పల్లి, ఆర్మూర్, బాల్కొండ, వర్ని పీఎస్‌లో ఒక్కొక్కరిపై కేసు నమోదు చేశామన్నారు. అంతేకాకుండా తప్పిపోయిన పిల్లల వివరాలను 'దర్పన్ యాప్ లో' నమోదు చేసి వారి అడ్రస్‌లను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

అటవీ భూమి కోసం రెండు గ్రామాల మధ్య ఘర్షణ




ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో

ఇందల్వాయి: మండలంలోని గౌరారం గ్రామ సౌత్ బీట్‌లో 425 కంపార్ట్‌మెంట్‌లో ఉన్న అటవీ భూమి విషయంలో గౌరారం గ్రామస్తులు, గుట్టకింది తండాకి చెందిన పలువురు గిరిజనుల మధ్య శనివారం వివాదం తలెత్తింది. గిరిజనులు అక్రమంగా అటవీ భూమిలో ఉన్న చెట్లు నరికి సాగుకు యత్నిస్తూ తమ పశువులను మేతకు రానివ్వడం లేదని అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చే సరికి ఇరువురు వాగ్వాదానికి దిగడంతో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం నలుగురు గిరిజన మహిళలను అధికారులు అదుపులోకి తీసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు.

ఘటనస్థలాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్వో

గొడవ సమాచారం అందుకున్న రేంజ్ అధికారి రవిమోహన్ భట్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాల వారిని వారి వారి గ్రామాలకు పంపించారు. అనంతరం ఆయన గౌరారం వీడీసీ సభ్యులతో మాట్లాడారు. పోడు పట్టాలకు మించి ఎవరు అటవీ భూములను ఆక్రమించవద్దని సూచించారు. గిరిజనులు అటవీ భూమిని ఆక్రమించడం నేరమని, భూమి ఆక్రమణకు గురి కాకుండా కందకాలు తవ్వించారు. పోడు పట్టాలను అడ్డుపెట్టుకొని గిరిజనులు వందల ఎకరాల అటవీ భూమిని ఆక్రమిస్తున్నారని గౌరారం వాసులు ఎఫ్ఆర్‌వోకి వివరించారు. అనంతరం అదుపులోకి తీసుకున్న గిరిజన మహిళలకు అటవీ చట్టాల గురించి వివరించి విడిచిపెట్టినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

తల్లితో గొడవపడి రైలులో కామారెడ్డికి..



కామారెడ్డి క్రైం: మతిస్థిమితం సరిగా లేని ఓ యువతిని కామారెడ్డి రైల్వే పోలీసులు వారి కుటుంబానికి శనివారం అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా నాచారంకు చెందిన భాగ్యరేఖకు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. తల్లి జ్యోతితో చిన్న గొడవ కావడంతో యువతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలు ఎక్కేసింది. కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్లాట్ ఫాంపై శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపించడంతో రైల్వే పోలీసులు ఆమెను సఖి కేంద్రానికి అప్పగించారు. ఆమె దగ్గరున్న సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. శనివారం తల్లి జ్యోతితో పాటు కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని సఖి కేంద్రానికి రాగా అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం రైల్వే ఎస్సై తావూ నాయక్ సమక్షంలో యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మొరం టిప్పర్ సీజ్

వర్ని: అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు రుద్రూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు శనివారం పేర్కొన్నారు. మండలంలోని రాయపూర్ క్యాంప్ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.